సాక్షి సిద్దిపేట

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024

మా ఊరి సంత.. భలే వింత!



దుబ్బాక పట్టణంలో జరుగుతున్న సంత

క్రయవిక్రయాలు బోలెడంత
- సరసమైన ధరలకే అంతా
- ప్రతి శనివారం జనాలే ఈ ప్రాంతమంతా
- ఉమ్మడి జిల్లాలోనే ఫేమస్ దుబ్బాక సంత

మా ఊరి సంత.. ప్రతి శనివారం జోరుగా సాగేటి సంత.. తాజా కూరగాయలే కాకుండా గుండు పిన్ను మొదలుకొని గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు, మటన్, చికెన్, చేపలు, దుస్తులు, గొర్రెలు, మేకలు, వ్యవసాయ పనిముట్లు, వేడుకలకు అవసరమయ్యే అన్ని రకాల సామగ్రి ఇక్కడ సరసమైన ధరలకే లభిస్తుండటంతో వేలాది మంది ఇక్కడకు వచ్చి కొనుగోళ్లు చేస్తుంటారు. జిల్లాలోనే కాకుండా చుట్టుపక్కల జిల్లాల్లో సైతం పెద్ద సంతగా దుబ్బాక పేరుగాంచింది. వేలాదిగా ప్రజలు, వ్యాపారులు వస్తుండటంతో ఊరంతా జనసంద్రంగా మారుతోంది.

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రాంతం భౌగోళికంగా రాజన్న సిరిసిల్లా, కామారెడ్డి, మెదక్ జిల్లాలకు సరిహద్దులో ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఈ సంతకు వస్తుంటారు. సుమారు రెండు దశాబ్దాల కింద వెలిసిన ఈ వారాంతపు సంత (అంగడి) అంతకంతకూ ఆదరణ పెరుగుతూనే ఉంది. పట్టణంలో 2006లో అప్పటి సర్పంచ్ వడ్లకొండ సుభద్రశ్రీధర్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలక మండలి ఆధ్వర్యంలో దుబ్బాకలో అంగడిని ఏర్పాటు చేశారు. స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో ఏర్పాటైన అంగడి క్రమంగా రాజీవ్ చౌరస్తా, బైపాస్ రోడ్, లచ్చపేట రోడ్ వరకు విస్తరించింది. అంగడి రోజు ఆ ప్రాంతం జనంతో కిక్కిరిసిపోతుంది. కూరగాయలు, పండ్లు, బట్టలు, ప్రతి చిన్న వస్తువు నుంచి పెద్ద వస్తువుల వరకు ఈ అంగడిలో అమ్ముతారు. చాలా దూరప్రాంతాలనుంచి దుబ్బాక అంగడికి అమ్ముకునేందుకు, కొనేందుకు సైతం వ్యాపారులు, ప్రజలు వస్తుంటారు.



దుబ్బాక అంగడిలో బట్టలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

గొర్రెలు, మేకలకు ప్రసిద్ధి

దుబ్బాక అంగడి గొర్రెలు, మేకలకు చాలా ప్రసిద్ధి. సంతలో వందల సంఖ్యలో గొర్రెలు, మేకలు క్రయవిక్రయాలు జరుగుతాయి. వీటితో పాటు ఆవులు, గేదెలు, ఎద్దులు అమ్మడం కొనడం జరుగుతోంది.

రూ.40 కోట్లకుపైగా వ్యాపార లావాదేవీలు

ప్రతి శనివారం అంగడిలో రూ.40 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు జరుగుతున్నట్లు సమాచారం. ఆ రోజు దుబ్బాక పట్టణంలోని రోడ్లన్నీ కిటకిటలాడుతుంటాయి. ముఖ్యంగా అంగడి బజార్‌లో వాహనాలు వెళ్లాలంటే నరకయాతనే. రోడ్లపైనే అంగడి కొనసాగుతుండటంతో ఇబ్బందులు తప్పడంలేదు. సంతకు వేల సంఖ్యలో జనం వస్తుంటారు. మున్సిపాలిటీకి ఈ అంగడితో చాలా ఆదాయం వస్తున్నా.. ట్రాఫిక్ నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

అన్ని రకాల వస్తువులు ఇక్కడే..



అంగడిలో అన్ని రకాల వస్తువులు, కూరగాయలు దొరుకుతాయి. ప్రతి శనివారం అంగడికి వచ్చి కూరగాయలు, ఇతర వస్తువులు కొనుక్కొని వెళ్తాం. ఎంత పని ఉన్నా అంగడికి వారం వారం రావడం మరువం.

–రేపాక పుష్పాంజలి, దుబ్బాక

తక్కువ ధరలకే..



అంగడిలో మంచి కూరగాయలు దొరుకుతాయి. ధర కూడా తక్కువనే ఉంటాయి. చాలా మంది రైతులు అంగడికి కూరగాయలు తెచ్చి అమ్ముకుంటారు. నచ్చినవి తీసుకోవచ్చు. ప్రతి శనివారం అంగడికి చాలా మంది వస్తుంటారు. దుబ్బాక అంగడి అంటే ఫేమస్. మా చుట్టాలు సైతం ఇక్కడికే వస్తుంటారు.

–మంజుల, దుబ్బాక

ఏళ్లుగా కూరగాయలు అమ్ముతున్నా..



నేను చిన్నప్పటినుంచి కూరగాయల వ్యాపారం చేస్తున్నా.. గతంలో లచ్చపేట అంగడిలో అమ్మేదాన్ని.. దుబ్బాక అంగడి ఇప్పుడు చాలా పెద్దగా అయింది. ప్రతి శనివారం బాగా సాగుతోంది. కూరగాయలు మంచిగా అమ్ముడు పోతాయి. మా కుటుంబానికి కూరగాయల వ్యాపారమే ఆధారం.

–ఎల్లవ్వ, కూరగాయల వ్యాపారి

కీలక పోస్టులన్నీ ఖాళీ

పురపాలికల్లో అటకెక్కిన పాలన
- ముఖ్య విభాగాల్లో అధికారులు కరువు
- పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- చేర్యాల, దుబ్బాకలకు మంజూరు కాని కమిషనర్ పోస్టులు
- పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరుతున్న ప్రజలు



సిద్దిపేట మున్సిపాలిటీ

మున్సిపాలిటీ	మంజూరు	కొనసాగుతున్న సిబ్బంది	ఖాళీలు
సిద్దిపేట	206	79	127
దుబ్బాక	47	25	22
హుస్నాబాద్	63	35	28
గజ్వేల్	54	21	33
చేర్యాల	17	13	04

సాక్షి, సిద్దిపేట: పురపాలికల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. దాదాపు చాలా మున్సిపాలిటీల్లో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీలున్నాయి. పట్టణాల్లో అధికారుల పర్యవేక్షణ లేక వివిధ చోట్ల ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణ, అంటువ్యాధులు, దోమల నివారణ చర్యలు కుంటుపడుతున్నాయి. ఆస్తి పన్ను సహా పలు రకాల పన్ను వసూళ్లు మందగిస్తున్నాయి. వివిధ రకాల సిబ్బంది లేకపోవడంతో సేవల్లో జాప్యం జరుగుతోంది.

చేర్యాల, దుబ్బాకలో..

సిద్దిపేటలో 43, గజ్వేల్ 20, దుబ్బాక 20, చేర్యాల 12, హుస్నాబాద్ 20 వార్డులున్నాయి. చేర్యాల, దుబ్బాక మున్సిపాలిటీలు ఏర్పాటై ఐదేళ్లు పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్ పోస్టు మంజూరు కాలేదు. అలాగే ప్రధాన విభాగాలైన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ అధికారి పోస్టులు సైతం మంజూరు లేదు. వీరికి జీతాలు ఆయా మున్సిపాలిటీలు చెల్లిస్తున్నాయి. సిద్దిపేట మున్సిపాలిటీలో హెల్త్ ఆఫీసర్ లేకపోవడంతో పట్టణంలో దోమల నివారణ చర్యలు తీసుకోవడం లేదు. అలాగే టౌన్ ప్లానింగ్ అధికారులు ఇద్దరికి మరో రెండు మున్సిపాలిటీలు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కరువడంతో జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి.

డిప్యుటేషన్ పై పలువురు

జిల్లాలో పలు మున్సిపాలిటీలలో డిప్యుటేషన్ పై కొందరు ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. డిప్యుటేషన్ కావడంతో పూర్తి స్థాయిలో దృష్టి పెట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సిద్దిపేట మున్సిపల్ ఈఈ ప్రతాప్ పదవీ విరమణ పొందినప్పటికీ ప్రత్యేక ఉత్తర్వులతో కొనసాగుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో కొనసాగింపు ముగియనుంది. సిద్దిపేట మున్సిపాలిటీలో అదనపు కమిషనర్‌గా కొండపాక ఎంపీఓ మల్లికార్జున్, మున్సిపల్ హరితహారం అధికారిగా మెదక్ జిల్లా సెరికల్చర్ అధికారి ఐలయ్య, సిద్దిపేట మున్సిపాలిటీలో డీఈగా జీహెచ్ఎంసీ డీఈ ప్రేరణ, హౌసింగ్ ఏఈ, పబ్లిక్ హెల్త్ ఏఈలు యాదగిరి, మహేష్‌లు ఇద్దరు, సిద్దిపేట మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పంచాయతీ కార్యదర్శి మాధవి డిప్యుటేషన్ పై కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేస్తోంది. ఇప్పటికే హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యుటేషన్లను రద్దుచేసిన విషయం తెలిసిందే. త్వరలో ఆయా శాఖల డిప్యుటేషన్లను సైతం రద్దు చేస్తే సిద్దిపేట మున్సిపాలిటీలో సగం అధికారులు సొంత విభాగాలకు వెళ్లనున్నారు. దీంతో సిద్దిపేట మున్సిపాలిటీలో పరిపాలనకు మరింత ఇబ్బంది కలుగనుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలు పూర్తి చేసి నీళ్లు ఇవ్వండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాకటౌన్: మల్లన్న సాగర్ పెండింగ్ కాలువలు పూర్తి చేసి పంటలకు నీళ్లు ఇవ్వాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అసెంబ్లీలో శుక్రవారం ప్రస్తావించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు ఉన్న దుబ్బాక నియోజకవర్గంలోనే కాలువలు పూర్తి కాకపోవడంతో పంటలకు నీళ్లు అందక ఎండుతున్నాయన్నారు. మల్లన్నసాగర్ నుంచి 5 ప్రధాన కాలువలు పూర్తయి ఇతర జిల్లాలకు, పక్క నియోజకవర్గాలకు నీళ్లు అందుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని చేగుంట, నార్సింగి మండలాల్లో కాలువలకు ఫారెస్ట్ అధికారులు అనుమతి నిరాకరించడంతో మధ్యలోనే పనులు ఆగిపోయాయన్నారు. ఇప్పటికే చాలా సార్లు పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, మంత్రులకు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలువలను వెంటనే పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో చెరువులు కుంటలు నింపి పంటలు కాపాడాలని ప్రభాకర్ రెడ్డి ప్రస్తావించారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశం..

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ అంశం శుక్రవారం అసెంబ్లీలో చర్చకు వచ్చింది. ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి రెవెన్యూ డివిజన్ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ తాను భువనగిరి ఎంపీగా ఉన్న సమయంలోనే చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం చేసిన దీక్షలో పాల్గొన్నానన్నారు. పలువురు రాష్ట్ర స్థాయి అధికారులకు వినతి పత్రాలు ఇచ్చిన విషయం గుర్తుచేశారు. తప్పకుండా రెవెన్యూ డివిజన్ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఏర్పాటు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కుల గణన బిల్లు ఆమోదం చరిత్రాత్మకం

హుస్నాబాద్: సమగ్ర కుల గణన బిల్లు శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కులగణన బిల్లును మంత్రి పొన్నం ప్రవేశపట్టే అవకాశం రావడం సంతోషదాయకమన్నారు. బిల్లు ఆమోదం పొందడం రాష్ట్రంలో చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. సమాజంలోని అట్టడుగు, బడుగు బలహీన వర్గాలు, దళిత, గిరిజన, మైనార్టీ, బీసీ వర్గాల జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకువస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అక్కు శ్రీనివాస్, వల్లపు రాజు, పున్న సది, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, సర్వాగౌడ్, పూదరి శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



కోమటిచెరువు వద్ద సామూహిక సూర్య నమస్కారాలు

ఓం సూర్యాయ నమః



రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని వ్యాస మహర్షి యోగ సొసైటీ, యోగాసన అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సూర్య నమస్కారాలు నేత్రానందంగా జరిగాయి. తెల్లవారుజామున స్థానిక కోమటిచెరువు, నెక్లెస్ రోడ్ ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రజలు సూర్య నమస్కారాలు చేశారు. యోగ గురువులు సతీష్, సంధ్యల ఆధ్వర్యంలో సూర్య శ్లోకాలకు లయబద్ధంగా చేయించారు. ఈ సందర్భంగా యోగ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందచేశారు.

-సిద్దిపేటజోన్

కార్మికలోకానికి తీరని నష్టం

- ఆ లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే
- వామపక్ష కార్మిక సంఘాల డిమాండ్
- చేర్యాలలో భారీ ర్యాలీ

చేర్యాల(సిద్దిపేట): కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందేనని ఏఐటీయూసీ బీటీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య అన్నారు. జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని గాంధీ సెంటర్ నుంచి సినిమా థియేటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం 4 కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్ట సవరణ చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ బడా పెట్టుబడిదారులకు అప్పగించి దేశసంపద కొల్లగొట్టారని విమర్శించారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి సమాన పనికి సమాన వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సదుపాయాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ కార్మికులకు రోజుకు రూ.800 చెల్లించాలని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేసి విత్తనాలు, ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక వర్గం ఆధ్వర్యంలో బీజేపీని గద్దె దించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్ష కార్మిక సంఘాల నాయకులు భూమయ్య, కృష్ణారెడ్డి, యాదగిరి, నాగరాజు, రంజిత్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు

న్యూస్‌రీల్

విజయ పాలకేంద్రం చైర్మన్‌గా బుచ్చిరెడ్డి



కొత్తగా ఎన్నికైన పాలకవర్గం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరు విజయ పాల ఉత్పత్తి సహకార సంఘానికి శుక్రవారం ఎన్నికలు జరిగాయి. రాపాక బుచ్చిరెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో మొత్తం 150 మంది రైతులు ఓటు హక్కు కల్గి ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. 150 మందికి 145మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఓట్ల లెక్కింపును నిర్వహించి వజ్జల ధనలక్ష్మి, గుత్తిలక్ష్మి, రాపాక జైపాల్‌రెడ్డి, రాపాక బుచ్చిరెడ్డి, రాజు, కర్రె రామచంద్రం, దాసరి మేఘనాథ్‌రెడ్డి, దూసకంటి ప్రశాంత్, కర్రె శ్రీనివాస్‌లు విజయం సాధించిన్నట్లు ఎన్నికల అధికారి పాలకుర్తి సిద్ధిరాములు ప్రకటించారు. బుచ్చిరెడ్డి వర్గం అధిక మెజారిటీ రావడంతో చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

రేపు కవి సమ్మేళనం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కవి సమ్మేళనం ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు సిరసం అధ్యక్షుడు అమ్మన చంద్రారెడ్డి, శ్రీవాణి సాహిత్య పరిషత్ అధ్యక్షుడు పెందోట వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా రచయితల సంఘం(సిరసం), శ్రీవాణీ సాహిత్య పరిషత్‌ల ఆధ్వర్యంలో జరిగే ఈ కవి సమ్మేళనం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు, సాహితీవేత్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా శిరీష

సిద్దిపేటరూరల్: భూసేకరణ, ఆర్అండ్ఆర్ యూనిట్ 1కి సంబంధించి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఆర్.శిరీష బదిలీపై వచ్చారు. రెవెన్యూ శాఖకు సంబంధించి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు, పోస్టింగ్‌లు చేపట్టారు. ఈమేరకు శిరీషకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇస్తూ బదిలీ చేశారు.

గర్భం దాల్చిన పదమూడేళ్ల బాలిక
నిందితుడిపై పోక్సో కేసు

వర్గల్(గజ్వేల్): పదమూడేళ్ల బాలిక గర్భం దాల్చింది. ఇందుకు కారణమైన నిందితుడిపై వర్గల్ మండలం గౌరారం పోలీసులు పోక్సో కేసు నమోదుచేశారు. ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం మండలానికి చెందిన బాలికను పొరుగున ఉండే యువకుడు మాయమాటలతో లోబర్చుకున్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. అనారోగ్యానికి గురైన బాలికకు ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయడంతో ఈ విషయం బయటపడింది. దీంతో గురువారం రాత్రి నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



రాంసాగర్‌లో విద్యార్థుల ప్రగతి రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

రాయపోలు(దుబ్బాక): టెన్త్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కృషిచేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలతో పాటు అనాజీపూర్, రాంసాగర్, రామారంలో పలు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతి రికార్డులను, మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపైనే శ్రద్ధ వహించాలన్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులకు తల్లిదండ్రులు కూడా సహకరించాలని సూచించారు. మండల విద్యాధికారి నర్సమ్మ, నోడల్ అధికారి సత్యనారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన

బెజ్జంకి(సిద్దిపేట): పట్టణంలో ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వల్ల ఉపాధి కోల్పోతున్నామన్నారు. ఆటో డ్రైవర్లకు న్యాయం చేసేలా ప్యాకేజీని ప్రకటించి ఆదుకోవాలని అధ్యక్షుడు రామంచ మల్లేష్ డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


బోయిని వెన్నెల

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బోయిని వెన్నెల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, పీఈటీ తోట వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్టులో స్థానం సాధించిన వెన్నెల సూర్యాపేట జిల్లాలోని మల్లారెడ్డి గూడెంలో నేటి నుంచి 19 వరకు జరిగే 33 వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెన్నెలను పాఠశాల టీచర్లు రవి శేఖర్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్, భూపాల్, దయాసాగర్ రెడ్డి, ప్రకాశ్, వినయ్, భాగ్యమ్మ, పద్మావతి, మేఘమాల, పెంటయ్య అభినందించారు.

వలంటీర్ల పాత్ర అభినందనీయం


మాట్లాడుతున్న రాష్ట్ర పర్యవేక్షకులు రోమిళ్ల

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు విద్యార్థులకు బోధించడం అభినందనీయమని రాష్ట్ర స్థాయి పర్యవేక్షకులు అభిజిత్, రోమిళ్ల, జిల్లా కమ్యూనిటీ మొబిలైసింగ్ అధికారి రంగనాథస్వామి కొనియాడారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా బోధిస్తూ వారికి ఆట, పాటలతోపాటు చదువుల్లో రాణించేలా ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రమేశ్ బాబు, డాక్టర్ రాజు, రామచంద్రం, మార్కండేయ, శివ, జబ్బర్, కైలాష్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పొలంలో జారి పడి వ్యక్తి మృతి


వరి పొలంలో రమేశ్ మృతదేహం

దౌల్తాబాద్(దుబ్బాక): వరి పొలంలో జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శేరిపల్లి బందారంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నోళ్ల రమేశ్ (43) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు పడుతూనే కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన రమేశ్ రాత్రి అయినా తిరిగి రాలేదు. శుక్రవారం తెల్లవారు జామున పొలాల వద్దకు వెళ్లిన రైతులు వరి పొలంలో పడి మృతి చెందిన రమేశ్‌ను గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోటారు సైకిళ్లు దగ్ధం



కొండపాక(గజ్వేల్): టాటా ఏసీ వాహనంలో తీసుకెళ్తున్న దివ్యాంగుల ఎలక్ట్రికల్ మోటార్ సైకిళ్లు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. ఈ ఘటన కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయానికి శుక్రవారం టాటా ఏసీ వాహనంలో దివ్యాంగులకు పంపిణీ చేసే 10 ఎలక్ట్రికల్ మోటార్ సైకిళ్లను తీసుకెళ్తున్నారు. అందులోని ఓ వాహనం బ్యాటరీ పేలడంతో మంటలు చెలరేగి మిగితా వాటికి అంటుకున్నాయి. గమనించిన డ్రైవరు వెంటనే మోటార్ సైకిళ్లను కిందకు దింపడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికే సుమారు ఆరు సైకిళ్లు పాక్షికంగా దగ్ధమయ్యాయి. ఈ విషయమై కుకునూరుపల్లి పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పత్తి ధర ఢమాల్

- క్వింటాల్‌కు రూ.7,020 నుంచి రూ.6,600కు
- రోజురోజుకూ పడిపోతున్న ధర
- కొనుగోళ్లు తగ్గిస్తున్న సీసీఐ
- ఆందోళన చెందుతున్న రైతులు


మనూరు జిన్నింగ్ మిల్లులో నిల్వ ఉన్న పత్తి

మనూరు(నారాయణఖేడ్): పత్తి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. రెండు నెలలు దాచిపెడితే మంచి ధర లభిస్తుందని భావించిన రైతన్నలకు నిరాశే ఎదురైతోంది. సీజన్ ప్రారంభంలో పత్తి ధరలు బాగానే ఉన్నా క్రమ క్రమంగా ధర పడిపోవడంతో రైతన్నల్లో ఆందోళన మొదలైంది. పత్తి ధర మొదట్లో సీసీఐ ద్వారా క్వింటాల్‌కు రూ. 7,020 ఉండగా ప్రస్తుతం రూ. 6,600 నుంచి రూ. 6,700 మధ్య కొనసాగుతోంది. రెండు నెలల కిందట ప్రారంభమైన సీసీఐ కొనుగోళ్లు ప్రస్తుతం పూర్తిగా తగ్గించడమే కాకుండా మరో రెండు రోజుల్లో కొనుగోళ్లు నిలిచిపోతున్నాయని మిల్లు నిర్వాహకులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

10 క్వింటాళ్ల మేర దిగుబడి

నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో దాదాపుగా 80 వేల ఎకరాల్లో పత్తి సాగు అవ్వగా ఎకరాకు సగటున 8 నుంచి 10 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. ఇప్పటికే రైతులు పత్తిని రెండుమార్లు తీసి చేళ్ల నుంచి తీసుకొచ్చి ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం 70 శాతం మేర రైతులు పత్తిని మార్కెట్‌కు తరలించారు. ధర పెరుగుతుందని ఆశతో ఉన్న మిగితా రైతుల్లో ఆందోళన మొదలైంది. మొదట్లో క్వింటాల్‌కు రూ. 7,020 ఉన్న పత్తి ధర ప్రస్తుతం రూ. 6,600 పడిపోయింది.

ప్రైవేట్ మార్కెట్‌లో లేని ధర

ప్రతీ ఏడాది పెద్ద రైతులు తాము పండించిన పత్తిని ఖేడ్ ప్రాంతం నుంచి గుజరాత్, మహారాష్ట్రలోని మద్నూర్ తదితర ప్రాంతాలకు తరలించేవారు. గతంలో సీసీఐ ధర కంటే ప్రైవేట్‌లో ఎక్కువ మద్దతు ధర వచ్చేది. కాగా ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల కారణంగా గుజరాత్ మార్కెట్‌నకు పత్తి వెళ్లకపోవడంతో ధర పెరగడం లేదని వ్యాపారస్తులు, దళారులు పేర్కొంటున్నారు. దీంతో ఈ ఏడాది ఆశించినంతగా రైతులకు లాభాలు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఉన్నకాడికే స్థానిక మిల్లుల్లోనే విక్రయాలు కొనసాగుతున్నాయి.

సీసీఐ కేంద్రాలను కొనసాగించాలి

పత్తి జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలను మరో నెల రోజులపాటు కొనసాగించాలని స్థానిక రైతులు అంటున్నారు. ఉన్న మార్కెట్ ధర ప్రకారమైనా తాము పత్తిని అమ్ముకుంటామని రైతులు పేర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు పేర్కొంటున్నారు.

మద్దతు ధర పెంచాలి



పత్తికి మద్దతు ధర పెరగాలే గాని రోజురోజుకూ తగ్గిస్తున్నారు. దీంతో తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సీసీఐ ద్వారా కొనుగోలు చేసే పత్తికి ధర అధికంగా ఉంటేనే ప్రైవేట్‌లో ధర ఎక్కువగా వస్తుంది. కానీ ఇప్పుడు ఉన్నకాడికి అమ్ముకోవాల్సి వస్తుంది.

– శివాజీ రావు, రైతు, మాయికోడ్

సీసీఐ కేంద్రాలు కొనసాగించాలి



సీసీఐ ద్వారా చేపడుతున్న కొనుగోళ్ల కేంద్రాలను కొనసాగించాలి. మరో నెల రోజుల వరకు కొనుగోలు తప్పనిసరిగా చేపట్టాలి. ఇప్పటికి వారంలో రెండు నుంచి మూడు రోజులు కొనడం ఆపడం వంటివి చేస్తున్నారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నాం. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– రాంశెట్టి, రైతు, నాగల్‌గిద్ద

ఇంకా నిర్ణయం రాలేదు

సీసీఐ ద్వారా కొనుగోలు చేసున్న పత్తి కేంద్రాలకు సంబంధించి కొనుగోలు నిలిపివేతపై తమకు ఇంకా ఎలాంటి సమాచారం లేదు. జిల్లాలోని రాయికోడ్, జోగిపేట, సదాశివపేట పరిధిలో సీసీఐ కొనుగోళ్లు పూర్తి అయినట్లు సమాచారం ఉంది. ఖేడ్ ప్రాంతంలో కొనుగోళ్లు ప్రస్తుతానికి కొనసాగుతున్నాయి. ఆగకుండా చూస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– వీర్‌శెట్టి, మార్కెట్ కమిటీ సెక్రెటరీ, ఖేడ్

గీ టీచరమ్మ మాకొద్దు

- అనుచితంగా ప్రవర్తిస్తోంది
- తోటి ఉపాధ్యాయుల ఆవేదన

మనోహరాబాద్(తూప్రాన్): ఉపాధ్యాయులు, విద్యార్థులతో అనుచితంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయురాలు వద్దని తోటి ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలంలోని కూచారం ఉన్నత పాఠశాలలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, హెచ్‌ఎం సవిత, పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడారు. తమ పాఠశాలలో ఎస్టీటీగా పని చేస్తున్న ఉపాధ్యాయురాలు అమరవాణి అనుచితంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రశ్నిస్తే చెప్పలేని విధంగా నానా బూతులు మాట్లాడుతుందని ఆరోపించారు. విద్యార్థులతో అనుచితంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ విషయమై డీఈఓకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హెచ్‌ఎంతో సైతం ఇదే విధంగా ప్రవర్తిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు నాగిరెడ్డి, పీఆర్టీయూ అధ్యక్షులు పద్మిని, టీపీటీఎఫ్ అధ్యక్షుడు నర్సింగం, ఉపాధ్యాయులు మురళీమనోహర్, మంజుల, బాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సాయిబాబు, లలిత, అరుణజ్యోతి, ప్రశాంత్, శ్రీలత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హైనా దాడిలో దూడ మృతి

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో లేగ దూడ మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్యానాయక్ తండాలో శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోహన్ అనే రైతు గురువారం రాత్రి ఎప్పటి మాదిరిగానే కొట్టంలో పశువులను కట్టేసి ఇంటికొచ్చాడు. తెల్లవారు జామున పశువుల కొట్టం వద్దకు వెళ్లి చూడగా లేగ దూడ తీవ్ర గాయాలతో చనిపోయి ఉండడాన్ని గమనించాడు. హైనా దాడిలోనే లేగ దూడ మృతి చెంది ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తల్లి, కూతురు అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తల్లి, కూతురు అదృశ్యమైన ఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. కొల్లూర్ పోలీసుల కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్ కు చెందిన జయంత్ బిశ్వాస్ భార్య కవితా బిశ్వాస్, నాలుగేళ్ల కూతురు అంకితతో కలిసి ఆరు నెల కిందట తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. మున్సిపాలిటీ పరిధిలోని ఓ లేబర్ క్యాంప్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. జయంత్ బిశ్వాస్ నిత్యం మద్యం సేవించి భార్యను కొట్టేవాడు. భర్త వేధింపులు తాళలేక కవిత కూతురుతో కలిసి ఈనెల 14వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులు, మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నర్సంపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం నర్సంపల్లి గ్రామానికి చెందిన బుక్యా గణేశ్(33) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై గురువారం రాత్రి ఇంటి ఎదుట రేకుల షెడ్డులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్

మిరుదొడ్డి(దుబ్బాక): జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని కాసులాబాద్‌లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను, వరి సాగును శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో ఆయిల్‌పామ్ తోటల్లో చేపట్టాల్సిన పద్ధతులపై ఆయా గ్రామాలకు కేటాయించిన ఏఈఓలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వరి సాగులో కాండం తొలుచు పురుగులు, మొగి పురుగులు సోకడం వల్ల రైతులు పలు రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రైతులు దిగాలు పడకుండా సకాలంలో సస్య రక్షణ చర్యలు చేపడితే మంచి ఫలితాలను సాధించవచ్చని శివప్రసాద్ సూచించారు.

మల్లన్న ఆదాయం రూ.1.15 కోట్లు


నగదును లెక్కిస్తున్న సిబ్బంది

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆదాయం 21 రోజుల్లో రూ.1.15 కోట్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శుక్రవారం స్వామి వారి ఆలయ ముఖ మండపంలో హుండీలను మెదక్ జిల్లా దేవాశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజు, ఇన్‌స్పెక్టర్ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, శివరాకృష్ణ సేవసమితి సభ్యులు లెక్కించారు. నగదు రూ1,15,59,209, విదేశీ కరెన్సీ నోట్లు 12, మిశ్రమ బంగారం 115 గ్రాములు, మిశ్రమ వెండి 10 కిలోల 100 గ్రాములు, పసుపు బియ్యం 20 క్వింటాళ్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నగదును స్థానిక బ్యాంక్‌లో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, కాయిత మోహన్, చీపురు భిక్షపతి, ఏఈవో శ్రీనివాస్, ఎస్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల మధ్య ఘర్షణ

చికిత్స పొందుతూ ఒకరు మృతి


మృతుడు పాండు

దుబ్బాకరూరల్: కార్మికుల మధ్య నెలకొన్న ఘర్షణలో తీవ్రగాయాలతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని అప్పనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11న దేవరాజ్ అనే రైతు పొలంలో సిద్దిపేటకు చెందిన రాజరాజేశ్వర బోర్‌వెల్స్ వారు బోర్ వేశారు. బోర్‌వెల్‌లో కొత్తగూడెంకు చెందిన మాడివి పాండు(19), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సునీల్ మధ్య వర్క్ షిఫ్టు విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో కోపంతో సునీల్ ఇనుప పారతో పాండు తలపై కొట్టాడు. తీవ్ర గాయాలైన అతడిని అక్కడే ఉన్న మిగతా కార్మికులు సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి పాండు మృతి చెందాడు. మృతుడి సోదరుడు జోగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సునీల్‌పై హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

ముగ్గురు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి పట్టుకున్న ఘటన మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ డంపింగ్ యార్డు సమీపంలో కొంత మంది వ్యక్తులు గంజాయి అమ్మడానికి ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. మద్దూరు ఎస్‌ఐ యూనిస్‌అలీ, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి వెళ్లి చూడగా టీవీఎస్ మోటార్ సైకిల్‌పై ముగ్గురు అనుమానంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా హైదరాబాద్ నుంచి తక్కువ ధరకు గంజాయి తెచ్చి విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారి నుంచి 74 గ్రాముల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు, మోటార్ సైకిల్, బంగ్ బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన సిద్దిరాములు, రాజు, రాకేశ్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

స్వేచ్ఛగా చరిత్రను రచించాలి

- ఓయూ ప్రొఫెసర్ అర్జున్‌రావు
- చరిత్రపై తొలిసారి జాతీయ స్థాయి సదస్సు

సిద్దిపేటఎడ్యుకేషన్: ఆధునిక యుగంలో తాను సేకరించిన ఆధారాల ప్రాతిపదికగా స్వేచ్ఛగా చరిత్రను రచించే అవకాశం నేటి చరిత్రకారులకు ఉందని ఉస్మానియా యూనివర్సిటీ సామాజిక శాస్త్రం డీన్, చరిత్ర ఆచార్యులు కుతాడి అర్జున్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానామస్ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మన ఊరు–మన చరిత్ర జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన యుగంలో చరిత్రకారులు ఆచార, సాంప్రదాయలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అలాగే, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, సదస్సు కన్వీనర్, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణలో చరిత్రపై జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించడం ఇదే ప్రథమమన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, పీజీ కో ఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యరెడ్డి, పరీక్షల నిర్వహణ విభాగాధిపతి డాక్టర్ గోపాల సుదర్శనం, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సుజాత, డాక్టర్ పల్లవి, డాక్టర్ భవానీ, ప్రముఖ తెలుగు అధ్యాపకులు, పరిశోధకులు సంఘనబట్ల నర్సయ్య, కళాశాల చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కొండల్‌రెడ్డి, భిక్షపతి, గణేశ్, నాగేశ్వర్‌రావుతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఆచార్యులు అర్జున్‌రావు

అద్దాలు పగులగొట్టి.. రూ.5 లక్షలతో ఉడాయించి

పార్కింగ్ చేసిన కారులో నగదు చోరీ


కాలనీలో విచారిస్తున్న పోలీసులు

చేగుంట(తూప్రాన్): కారు అద్దాలు పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు రూ.5 లక్షలు చోరీ చేసిన ఘటన మండల కేంద్రమైన చేగుంట సీతారామ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండలం పెద్దచెప్యాల గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి బిల్డర్‌గా పని చేస్తున్నాడు. తనకు రావాల్సిన డబ్బుల కోసం చేగుంటకు వచ్చి యూనియన్ బ్యాంకులో నగదు డ్రా చేసి కారులో పెట్టుకున్నాడు. అనంతరం సీతారామ కాలనీలో తన మిత్రుడి ఇంటికి టీ తాగడానికి వచ్చాడు. బ్యాంకు వద్ద నుంచే కారును గమనిస్తున్న నలుగురు వ్యక్తులు బిల్డర్ వెంట వచ్చారు. విష్ణువర్ధన్‌రెడ్డి లోపలికి వెళ్లగానే రెండు బైకులపై వచ్చిన నలుగురు దొంగలు కొంత దూరంలో వాహనాలు ఆపారు. అందులో ఓ వ్యక్తి కారు అద్దాలు పగులగొట్టి రూ.5లక్షలు ఎత్తుకెళ్లాడు. గమనించిన స్థానికులతోపాటు బాధితుడు విష్ణువర్ధన్‌రెడ్డి బయటకొచ్చి పట్టుకునేందుకు ప్రయత్నించేలోపే పారిపోయారు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ వెంకటేశ్, స్థానిక ఎస్‌ఐ బాలరాజ్‌లతో కలిసి సీతారామ కాలనీలో విచారణ జరిపారు. కాలనీలోని ఇళ్లతోపాటు బ్యాంక్ ఆవరణలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. దొంగలను పట్టుకునేందుకు చర్యలు ప్రారంభించామని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

అమ్మతనం గుర్తించిన కన్న తల్లి

- శ్మశానంలో బిడ్డను వదిలిన వైనం
- అధికారుల కౌన్సెలింగ్‌తో తల్లి చెంతకు బాలుడు
- సాక లేక వదిలేశానన్న బాధితురాలు


తల్లికి కౌన్సిలింగ్ ఇస్తున్న అధికారులు

పుల్‌కల్(అందోల్): అమ్మతనం గుర్తించిన కన్న తల్లి శ్మశానంలో వదిలిపెట్టిన మగబిడ్డను సాకటానికి పొత్తిళ్లలోకి తీసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామంలో బుధవారం ఓ మహిళ శ్మశానవాటికలో అప్పుడే పుట్టిన మగబిడ్డను వదిలిపెట్టిన విషయం తెలిసిందే. ఈ దారుణానికి ఒడిగట్టిన మహిళ అదే గ్రామానికి చెందిన బోయిని ఎల్లమ్మగా శిశు సంక్షేమ అధికారులు గ్రామస్తుల సాయంతో గుర్తించారు. వెంటనే ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి బిడ్డను పోషించుకునేలా ఒప్పించి ఈ మేరకు ఒప్పందపత్రం రాయించుకున్నారు. భర్త లేకపోవడం ఇప్పటికే ఓ ఆడ కూతురు ఉండడంతో మగబిడ్డను పోషించలేక వదిలించుకోవాలనుకున్న అని తెలిపింది. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి లలిత కుమారి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రత్నం కృషితో ఆ తల్లి బిడ్డను పోషించుకుంటా అని ఒప్పుకోవడంతో ఆమెకు అప్పగించారు.

సత్వర న్యాయానికి కృషి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు


మాట్లాడుతున్న ప్రభాకరరావు

సంగారెడ్డి టౌన్: కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టులో మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న సందర్భంగా పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రిమినల్ కాంపౌండ్, ఎక్సైజ్, డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఎక్కువగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు, అడిషనల్ ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్య, న్యాయవాదులు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్ స్థలం ధారాదత్తం

- హెచ్‌ఎంకు తెలియకుండా పంచాయతీ కార్యదర్శి నిర్వాకం
- ఇంటి నంబర్ కేటాయించి మరీ బదలాయింపు
- 566 గజాలు గిఫ్ట్ డీడ్ చేసిన వైనం


వెల్దుర్తి ఉన్నత పాఠశాల

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాల స్థలం కబ్జాకు గురికాకుండా ప్రభుత్వం ఓ వైపు కోట్ల రూపాయల నిధులు వెచ్చించి ప్రహరీలు నిర్మిస్తుంటే మండల కేంద్రమైన వెల్దుర్తిలో పంచాయతీ కార్యదర్శి ఇందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది. విద్యార్థులు ఆడుకునే క్రీడా స్థలానికి ఏకంగా ఇంటి నంబర్ కేటాయించి ఓ భవన నిర్మాణానికి దారాదత్తం చేశారు. హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ కమిటీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సంబంధిత కార్యాలయ సెక్రటరీ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. యాజమాన్య ధ్రువపత్రం సైతం అందజేశారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లోనే హద్దులు తప్పుల తడకగా ఉండడం, సాక్షులుగా పంచాయతీ సిబ్బంది మాత్రమే ఉండడంతో స్థలం బదలాయింపులో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

ఇంటి నంబర్ కేటాయించి..

వెల్దుర్తి ఉన్నత పాఠశాల ఆట స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణం కోసం సుమారు వెయ్యి గజాలు కేటాయించాలని గ్రామ పంచాయతీ మే 2019లో తీర్మానం చేసింది. ఈ కాపీని పాఠశాల హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ కమిటీ, మండల విద్యాధికారి కార్యాలయంలో అందించ లేదు. ఇంతలోనే అప్పటి పంచాయతీ కార్యదర్శి పద్మ 5,100 చదరపు అడుగుల పాఠశాల ఆట స్థలానికి ఇంటి నంబర్ కేటాయించి యాజమాన్య ధ్రువపత్రం తయారు చేసింది. అనంతరం ఇరవై రోజులకు పాఠశాల స్థలంలో 566.66 గజాలు జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ పేరిట గిఫ్ట్ డీడ్ చేశారు. ఈ స్థలం గ్రంథాలయ నిర్వాహకులది అనడంతో పాఠశాల యాజమాన్యం కంగుతిన్నారు. ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకొని ఆట స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని వారు కోరుతున్నారు.

ఎలాంటి సమాచారం లేదు..

పాఠశాల ఆట స్థలం గ్రంథాలయ భవన నిర్మాణానికి కేటాయించడానికి పంచాయతీలో చేసిన తీర్మానం విషయం కూడా మాకు తెలియదు. ఎస్ఎంసీ కమిటీలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే నిబంధలనకు పూర్తి విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శి వేరే శాఖకు గిఫ్ట్ డీడ్ చేశారు. ఈ విషయంలో రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

–సాంబయ్య, హెచ్‌ఎం